సాక్షి
తిరుపతి
బుధవారం । 7 । ఆగస్టు । 2024



13న ఎస్‌ఎస్‌ఎల్‌వీ డీ3 ప్రయోగం?
షార్ నుంచి ఈనెల 13న స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ డీ–3 రాకెట్ ప్రయోగానికి సిద్ధమైంది. - 8లో



చరిత్రకెక్కిన 'చేనేత'
వెంకటగిరి చేనేత చీరలు అంతర్జాతీయ ఖ్యాతి పొందాయి. ఇక్కడి చీరలను ఆన్‌లైన్‌లో సైతం విక్రయిస్తున్నారు. - 8లో



స్వర్ణముఖిలో ఇసుక దోపిడీ
శ్రీకాళహస్తి మండలం టీవీఎం కండ్రిగ వద్ద స్వర్ణముఖి నదిలో టీడీపీ నేతలు యథేచ్ఛగా ఇసుకను తవ్వేసి అమ్మేస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి లడ్డూ కౌంటర్ల పరిశీలన



కౌంటర్‌ను పరిశీలిస్తున్న అదనపు ఈఓ వెంకయ్య చౌదరి

తిరుమల : తిరుమలలోని శ్రీవారి లడ్డూ కాంప్లెక్స్‌ను మంగళవారం టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి పరిశీలించారు. దర్శనం టికెట్లపై కౌంటర్లలో లడ్డూలు జారీ చేసే విధానాన్ని ఆరా తీశారు. అనంతరం లడ్డూ ప్రసాదాల తయారీకి సంబంధించిన ముడిసరుకులను నిల్వ చేసిన ఉగ్రాణాన్ని సందర్శించారు. కార్యక్రమంలో పోటు పేష్కార్ శ్రీనివాసులు, వీజీఓ శ్రీనంద కిషోర్ పాల్గొన్నారు.

తక్కువ ధరకే 'బీఎస్‌ఎన్‌ఎల్' సేవలు

తిరుపతి(అలిపిరి): భారత ప్రభుత్వరంగ సంస్థ 'బీఎస్‌ఎన్‌ఎల్' అతి తక్కువ ధరకే సేవలందిస్తూ వినియోగదారులకు మరింత చేరువ అయ్యే దిశలో పయనిస్తోందని చిత్తూరు బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ సీపీ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 4జీ సేవలు ప్రారంభిస్తున్న సందర్భంగా ఈనెల 12వ తేదీలోపు వినియోగదారులు బీఎస్‌ఎన్‌ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీ), మేళాకు విచ్చేయాలని కోరారు. జిల్లాలోని బీఎస్‌ఎన్‌ఎల్ సీఎస్‌సీలు, ఫ్రాంచైజీలు, ఏజెంట్ల వద్ద 4జీ సిమ్‌లను ఉచితంగా పొందవచ్చని వెల్లడించారు.

ఎస్పీడబ్ల్యూ విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

తిరుపతి సిటీ : శ్రీకృష్ణ జన్మాష్టమిపై తిరుపతి ఇస్కాన్ సంస్థ నిర్వహించిన జిల్లా స్థాయి డిబేట్‌లో పద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థినులు ప్రతిభను ప్రదర్శించారు. ప్రిన్సిపల్ నారాయణమ్మ మాట్లాడుతూ విద్యార్థినులు మేధోశక్తి పెరుగుదలకు ఇటువంటి పోటీలు ఎంతో ఉపయోగకరమన్నారు. డిబేట్‌లో పరిమళ, చందన ప్రథమ, లావన్, లలిత ద్వితీయ, అంబిక తృతీయ బహుమతిని గెలుచుకున్నట్లు వివరించారు. అనంతరం సత్తా చాటిన విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ కృష్ణవేణి, భద్రమణి, విద్యుల్లత, జయశ్రీ, సుజాతమ్మ, వసుధ, శోభ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

తిరుపతి సిటీ : పద్మావతీ వర్సిటీ నర్సింగ్ కాలేజ్, మహిళా అధ్యయన కేంద్రం వారు మంగళవారం స్థానిక ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ మెడిసిన్ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అకస్మాత్తుగా గుండెకొట్టుకోవడం ఆగినప్పుడు, ఊపిరితిత్తులు శ్వాస తీసుకోలేని స్థితిలో ఉన్నప్పుడు వాటి పునరుద్ధరణకు చేసే అత్యవసర ప్రక్రియను సీపీఆర్ అంటారని తెలిపారు. ప్రతి విద్యార్థి సీపీఆర్‌పై కచ్చితమైన అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ప్రాక్టికల్‌గా సీపీఆర్‌పై డెమో అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ పరమేశ్వర, నర్సింగ్ కాలేజ్ అధ్యాపకులు మునిచంద్రిక, జోత్స్న పాల్గొన్నారు.

షార్‌లో క్విజ్ పోటీలు

సూళ్లూరుపేట : సతీష్ ధవన్ స్పేస్‌సెంటర్‌లో మంగళవారం సూళ్లూరుపేట ప్రభుత్వ పాఠశాలల్లోని 8,9,10 తరగతుల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎస్.హిమ హన్సిని, కె.సురంజన, ఎన్.యశస్విని ప్రథమస్థానంలో నిలిచి ప్రతిభను చాటుకున్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని ఓ.అమృత లక్ష్మీ అనే విద్యార్థిని ప్రథమస్థానంలో నిలిచింది. విజేతలను షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అభినందించి బహుమతులు ప్రదానం చేశారు.

అధికార బలంతో పచ్చమూక రెచ్చిపోతోంది. అడ్డూ అదుపూ లేకుండా అరాచకాలకు పాల్పడుతోంది. వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యంగా దాడులకు తెగబడుతోంది. ఊర్ల నుంచి దౌర్జన్యంగా తరిమికొడుతోంది. చివరకు ఫ్యాన్ గుర్తుకు ఓటేసిన వారిని సైతం వెంటాడి వేటాడుతోంది. కూటమి నేతల ఆగడాలకు గ్రామాలకు గ్రామాలనే ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు. మూకుమ్మడిగా మీద పడి ఆస్తులను ధ్వంసం చేస్తుంటే ప్రాణాలు అరచేతితో పెట్టుకుని దాక్కుంటున్నారు. చేతికొచ్చిన పంటలను పొలంలోనే విడిచిపెట్టి ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారు. టీడీపీ గూండాల దాష్టీకాలకు వందలాది మంది పుట్టి పెరిగిన ఊరిని వదిలేసి బిక్కు బిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. స్వేచ్ఛగా బయట తిరగలేక చిత్రహింసలు అనుభవిస్తున్నారు. బాధితుల పిల్లలు చదువుకు దూరమై కన్నీటిపర్యంతమవుతున్నారు.

శ్రీకాళహస్తిలో కోనేరు వద్ద ఉన్న బండపై నిద్రిస్తున్న కొత్తకండ్రిగకు చెందిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



గూడు వదిలి..

గుండె పగిలి..!

కనికరించండి.. చదువుకోవాలని ఉంది

టీడీపీ నేతల దౌర్జన్యానికి ఊరొదిలి వెళ్లిన కుటుంబాల్లో బడి ఈడు పిల్లలు ఉన్నారు. డిగ్రీ, ఇంటర్, పదో తరగతి విద్యార్థులు తమకు చదువుకోవాలని ఉందని తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. ఊర్లోకి వెళితే చావగొడతారని భయపడి ఇతర ప్రాంతాల్లో తలదాచుకుని జీవనం సాగిస్తున్నారు. విద్యార్థుల గురించి తెలుసుకుని 'చేతులెత్తి మొక్కుతాం.. చదువుకోనివ్వండి' అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ విషయంపై విద్యాశాఖ అధికారులు ఈశ్వరయ్యకాలనీ పరిధిలోని పాఠశాల ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. ఉపాధ్యాయులకు సంబంధం లేకపోయినా.. ఉన్నతాధికారులు వారికి నోటీసులు జారీ చేశారు. ఈ ఘటనలపై స్పందించాల్సిన పోలీసులు బాధ్యత మరచి వ్యవహరిస్తుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నేతల అరాచకాలపై మానవహక్కుల సంఘం స్పందించాలని బాధితులు వేడుకుంటున్నారు.

- టీడీపీ నేతల అరాచకాలకు ఖాళీ అవుతున్న గ్రామాలు
- ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని వెళ్లిపోతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- పుట్టి పెరిగిన పల్లెను విడిచిపెట్టి వలసబోతున్న కుటుంబాలు
- చదువుకు సైతం దూరమవుతున్న బాధితుల పిల్లలు
- పచ్చమూక ఆగడాలను పట్టించుకోని పోలీసులు



నిర్మానుష్యంగా ఈశ్వరయ్య కాలనీ

సాక్షి ప్రతినిధి, తిరుపతి : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రెండు నెలలుగా టీడీపీ రౌడీలు దారుణంగా దాడులకు పాల్పడుతున్నారు. ఫ్యాను గుర్తుకు ఓటేశారని కొందరిని, వైఎస్సార్‌సీపీ చెందిన మరి కొందరిని లక్ష్యంగా చేసుకుని అరాచకాలకు తెగబడుతున్నారు. టీడీపీ మూకల దాడుల్లో అనేక మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఆస్తులు పోగొట్టుకున్నారు. ప్రాణభయంతో ఊరొదిలి వెళ్లిపోయారు. అలా వెళ్లని వారిని టీడీపీ నేతలు నిత్యం బెదిరిస్తూ ఊరొదిలి వెళ్లిపోవాలని హుకుం జారీ చేస్తున్నారు. పచ్చమూకల రాక్షస క్రీడలో అనేక మంది విద్యార్థులు బడులు, కళాశాలలకు వెళ్లలేక చదువుకు దూరమయ్యారు.

అడవిలో బిక్కుబిక్కుమంటూ..

పుంగనూరు నియోజక వర్గం సోమల మండలం కమ్మపల్లెలో వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ మూక దాడులు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో 13 కుటుంబాల వారు నరకం అనుభవిస్తున్నారు.

అజ్ఞాతంలో పుంగనూరు వాసులు

పుంగనూరు నియోజక వర్గం సోమల మండల పరిధిలోని కమ్మపల్లె, నంజంపేట, సోమల, కందూరు, పుంగనూరు పరిధిలోని 25 కుటుంబాలు, రొంపిచర్ల మండలానికి చెందిన మరో 55 కుటుంబాలు టీడీపీ మూకల దాడులకు భయపడి తలా ఒక దిక్కుకు వెళ్లిపోయారు. వీరిని ఊర్లోకి రప్పించి చిత్రహింసలు పెట్టాలనే ఉద్దేశంతో పచ్చ గూండాలు విశ్వప్రయత్నం చేస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా వారి ఫొటోలను షేర్‌చేసి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు సమాచారం.

వీరిలో సుబ్రమణ్యంరెడ్డి, ఆయన భార్య ఊరొదిలి వెళ్లిపోయారు. పుంగనూరులో కుమార్తె జయంతి వద్ద తలదాచుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ గూండాలు సోమవారం పుంగనూరు చేరుకుని సుబ్రమణ్యంరెడ్డి కోసం గాలించారు. ఇది పసిగట్టిన సుబ్రమణ్యంరెడ్డి కుటుంబం అర్ధరాత్రి ఊరు విడిచి అడవిలోకి వెళ్లిపోయింది. రెండు రోజుల పాటు బిక్కు బిక్కుమంటూ అక్కడే గడిపింది. అప్పటికీ వదిలిపెట్టని టీడీపీ గూండాలు సుబ్రమణ్యంరెడ్డి దంపతులను గ్రామానికి రప్పించాలని మిగిలిన 12 కుటుంబాల వారిని చిత్రహింసలకు గురి చేస్తున్నారు. ఈ క్రమంలోనే నంజంపేట, సోమల, కందూరు, చౌడేపల్లెలో మరో 25 కుటుంబాలు ఊరొదిలి వెళ్లిపోయాయి. వారు ఎక్కడున్నారో ఇప్పటికీ తెలియని పరిస్థితి. రొంపిచర్ల మండలంలో సుమారు 300 కుటుంబాల వారు టీడీపీ నేతల దాష్టీకానికి భయపడి ఊరొదిలి పారిపోయారు. వారిని తిరిగి గ్రామానికి రప్పించేందుకు కొందరి నివాసాలు, షెడ్లు, ప్రహరీగోడలను సైతం పచ్చమూక కూల్చివేసింది. మామిడి తోటలను ధ్వంసం చేసింది. వైఎస్సార్‌సీపీకి ఓటేశారని కక్షతో అనేక మంది వ్యాపారుల దుకాణాలను మూయించి వేసింది.

రోజుకో చోట..

తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగకు చెందిన 15 కుటుంబాలు ఊరొదిలి వెళ్లి నెల అవుతోంది. రోజుకో చోట తలదాచుకుంటూ దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. ఆలయాలు, సత్రాలు, ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ల వద్ద కాలం గడుపుతున్నారు. భార్యల మెడలోని పుస్తెలు అమ్ముకుని రోజులు నెట్టుకొస్తున్నారు.

రాష్ట్రం కాని రాష్ట్రంలో..



ఈశ్వరయ్య కాలనీలో తాళాలు వేసి ఉన్న ఇల్లు

శ్రీకాళహస్తి మండలం ఎంపేడు పంచాయతీ ఈశ్వరయ్యకాలనీకి చెందిన 30 కుటుంబాలవారు ఒడిశాలోని ఓ ప్రాంతంలో తలదాచుకుంటున్నారు. పరదాలతో టెంట్లు వేసుకుని భయం భయంగా కాలం గడుపుతున్నారు. కూలి పనులు చేసుకుని పొట్టపోసుకుంటున్నారు. పని దొరకని రోజు పస్తులుంటున్నారు. పాములు, విషపురుగులతో సహవాసం చేస్తూ ప్రాణాలు ఉగ్గబట్టుకుని బతుకున్నారు. స్కూలు, కళాశాలలకు వెళ్లాలని పిల్లలు మారం చేస్తున్నా ఊర్లోకి తీసుకెళ్లలేని దుస్థితిలో జీవనం సాగిస్తున్నారు.

ముక్కంటి చెంత రౌడీయిజం

శ్రీకాళహస్తి నియోజక వర్గం తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగలో వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారని 15 కుటుంబాలపై టీడీపీ రౌడీలు దాడికి దిగారు. వారి ఇళ్లలోకి చొరబడి దారుణంగా కొట్టారు. చేతులెత్తి దండంపెట్టినా వినకుండా విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. టీడీపీ నేతల ఒత్తిడితో తిరిగి బాధితులపైనే 307 సెక్షన్ కేసు నమోదు చేశారు. దాడికి తెగబడిన వారిపై మాత్రం తూతూ మంత్రంగా కేసుపెట్టి చేతులు దులుపుకున్నారు. దీంతో చేసేదిలేక 15 కుటుంబాలు ఊరొదిలి వెళ్లిపోయాయి. శ్రీకాళహస్తి మండలం ఎంపేడు పంచాయతీ ఈశ్వరయ్యకాలనీకి చెందిన 30 షికారీ కుటుంబాలు రెండు నెలలుగా ఒడిశా రాష్ట్రానికి వెళ్లి తలదాచుకుని ఉన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటేశారన్న అక్కసుతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు షికారీల నివాసాల్లోకి దూరి కర్రలు, రాళ్లతో దాడులు చేసి తీవ్రంగా గాయపరచారు. ఊరొదిలి వెళ్లాలని, లేకుంటే చంపేస్తామని బెదిరించారు. దీంతో జూన్ 7వ తేదిన 30 కుటుంబాలు గ్రామాన్ని విడిచిపెట్టి పిల్ల,పాపలతో కలసి తట్టా, బుట్టా సర్దుకుని వెళ్లిపోయారు. ఊరొదిలిన వారిలో గ్రామ సర్పంచ్ సుమతి కూడా ఉన్నారు.



ఊరొదిలి వచ్చేసిన కొత్తకండ్రిగ వాసులు (ఫైల్)

రామాలయానికి 'పచ్చ' గ్రహణం

- గుడి నిర్మాణ పనులను అడ్డుకున్న టీడీపీ నేతలు
- వైఎస్సార్‌సీపీకి గ్రామస్తులు మద్దతు పలికినందుకే పనులు నిలిపివేత
- ఆలయ స్థలం ఆక్రమణకు యత్నిస్తున్న తమ్ముళ్లు



కాలూరు గ్రామంలో టీడీపీ నేతల కారణంగా ఆగిపోయిన రామాలయం నిర్మాణ పనులు

తిరుపతి రూరల్ : "మీరందరూ వైఎస్సార్‌సీపీకి పనిచేశారంటగా...మావాళ్లు చెప్పారు. మీరు గుడి కట్టేది మా వాళ్లకు నచ్చలేదు. వెంటనే నిర్మాణ పనులు ఆపేయండి...మా వాళ్లు ఒప్పుకున్నప్పుడు చూద్దాం"..అంటూ టీడీపీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి హుకుం జారీ చేశారు. ఆయన నోటి నుంచి వచ్చిన మాటలతో గ్రామస్తులు అవాక్కయ్యారు. వివరాలు.. దేవదాయశాఖ ఆధ్వర్యంలో రూ.29.60 లక్షల వ్యయంతో తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం పంచాయతీ కాలూరు గ్రామంలో శ్రీరామ భజన మందిరం పేరుతో రామాలయం నిర్మిస్తున్నారు. నిబంధనల మేరకు గ్రామస్తులు అందరూ కలిసి మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్‌గా రూ.7.40 లక్షలను బ్యాంకులో డిపాజిట్ చేసి మరీ దేవదాయశాఖకు చూపించారు. దీంతో కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు విడుదల చేశారు. రామాలయం నిర్మాణం కూడా శరవేగంగా సాగుతోంది. అయితే టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గుడికి పక్కనే నివసిస్తున్న టీడీపీ కార్యకర్త ఒకరు గుడి నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారు. గుడి స్థలాన్ని కబ్జా చేసేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలను గ్రామస్తులు తిప్పికొట్టారు. దీంతో నియోజకవర్గ ప్రజాప్రతినిధి ద్వారా బెదిరింపులకు పాల్పడుతూ, ఆలయ నిర్మాణ పనులను నిలిపివేశారు. దీంతో మంగళవారం ప్రజాప్రతినిధిని కలిసి గుడి నిర్మాణానికి అడ్డుపడుతున్న వైనాన్ని గ్రామస్తులు వివరించారు. ఆయన మీరందరూ వైఎస్సార్‌సీపీకి పనిచేశారు. జెండాను మోసినట్లు నాదగ్గర ఆధారాలు ఉన్నాయి. మా వాళ్లు వచ్చి చెప్తే తప్ప పనులు ముందుకు సాగవు...అంటూ తేల్చి చెప్పేశారు. మీరు వెళ్లి పార్టీ తిరుపతి రూరల్ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డిని కలవండి అంటూ చెప్పడంతో గ్రామస్తులు ఉసూరుమంటూ వెనుదిరిగారు. ప్రజాప్రతినిధిగా ఉండి ఆలయ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తికి వత్తాసు పలకడం, 'మీరు మాప్రత్యర్థి పార్టీకి పని చేశారు. మీకు పని చేయను' అంటూ సమాధానం ఇవ్వడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. గుడి నిర్మాణ పనులను అడ్డుకుంటున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. దీనిపై దేవదాయశాఖ జిల్లా అధికారి రామకృష్ణారెడ్డిని వివరణ కోరగా, మరో రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

నా పట్టా భూమిని టీడీపీ నేతలు కాజేశారు

- ఆ భూమిలో అక్రమంగా ఇసుకను దోచేస్తున్నారు
- అమెరికా నుంచి విశ్రాంత డీపీఆర్‌ఓ శంకర్‌రెడ్డి వీడియో
- తన భూమిని కాపాడాలంటూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్‌కు అభ్యర్థన



అమెరికా నుంచి వీడియో ద్వారా అభ్యర్థిస్తున్న విశ్రాంత డీపీఆర్‌ఓ శంకర్‌రెడ్డి

తిరుపతి రూరల్ : ఓ రిటైర్డ్ ప్రభుత్వోద్యోగికి చెందిన భూమిని టీడీపీ నేతలు ఆక్రమించిన వైనమిది.. 80 ఏళ్లు పైబడిన ఆయన తన భూమిని కాపాడాలంటూ అమెరికా నుంచి వీడియోలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్‌లను అభ్యర్థించడంతో ఈ ఆక్రమణల పర్వం వెలుగులోకొచ్చింది. 'మాకు తిరుచానూరు లెక్కదాఖల సర్వే నంబర్ 464లో పట్టా భూమి ఉంది. దీనిని తిరుచానూరు, పాడిపేట, తనపల్లికి చెందిన కొందరు టీడీపీ నేతలు ఆక్రమిస్తున్నారు. ఆక్రమించడమే కాకుండా వాటాలు వేసుకుని మరీ పంచుకున్నారు. పట్టా భూమిలో ఉన్న ఇసుకను రాత్రి, పగలు అనే తేడా లేకుండా దోచుకుంటున్నారు. 40 ఏళ్ల పాటు ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసి, పైసా పైసా కూడబెట్టుకుని భూమిని కొనుక్కొన్నాను. డీపీఆర్వోగా రిటైర్డ్ అయ్యాను. పిల్లలు అమెరికాలో ఉంటే చూద్దామని అమెరికాకు వచ్చాను. నేను లేని సమయం చూసుకుని ఇసుక కోసం నా పట్టా భూమిని పాడిపేటకు చెందిన మల్లి, తనపల్లికి చెందిన వెంకటాచలం, తిరుచానూరుకు చెందిన ఇంద్రారెడ్డి, దాసురెడ్డి, కిషోర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, తిరుపతికి చెందిన మణిలు.. గ్రూప్‌గా ఏర్పడి మరీ ఆక్రమించారు. ఇసుకను దోచేస్తున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్, జిల్లా కలెక్టర్, ఎస్పీలు స్పందించి కబ్జా రాయుళ్ల నుంచి నా పట్టా భూమిని కాపాడండి'.. అంటూ ఆ విశ్రాంత డీపీఆర్వో శంకర్‌రెడ్డి వీడియోలో వేడుకున్నారు. దీనిపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

తిరుపతి రూరల్ : విద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు బుధవారం ప్రత్యేకంగా 'విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక' నిర్వహించనున్నట్లు ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఈఈ వాసుదేవరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యాలయాల్లో వినతులు అందించవచ్చని సూచించారు. బాలాజీ కాలనీ, కేటీరోడ్డు, తిరుపతి నార్త్, తిరుపతి వెస్ట్, రాజీవ్‌నగర్ విద్యుత్ సెక్షన్ల పరిధిలోని వారు టీటీడీ ఏడీ బిల్డింగ్‌లోని విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం, తిరుపతి ఈస్ట్, కొర్లగుంట, మాధవనగర్, దామినేడు, మంగళం రూరల్ సెక్షన్ల పరిధిలోని వారు శ్రీనివాసంలోని డీఈ కార్యాలయం, రేణిగుంట ఆపరేషన్స్, రూరల్ సెక్షన్ పరిధిలోని వారు రేణిగుంటలోని డీఈ కార్యాలయం, తిరుపతి సౌత్, ఆపరేషన్ సెక్షన్, తిరుచానూరు, అవిలాల సెక్షన్ల పరిధిలోని వారు పాత తిరుచానూరు రోడ్డులోని ఈఈ కార్యాలయంలో అర్జీలను అందించవచ్చని వివరించారు.

ముగిసిన నాన్ టీచింగ్ సంఘం క్రీడలు



పోటీలలో పాల్గొన్న ఉద్యోగులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఎన్టీఆర్ స్టేడియంలో గత రెండు రోజులుగా సాగుతున్న ఎస్వీయూ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ క్రీడాపోటీలు మంగళవారంతో ముగిశాయి. ఇందులో ప్రధానంగా క్రికెట్‌లో గెలుపొందిన రమేష్‌కృష్ణ, హేమంత్ జట్లను విజేతలుగా ప్రకటించినట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీధర్, జాయింట్ సెక్రటరీ ముత్తువేలు తెలిపారు. కన్వీనర్లు లక్ష్మీనాథ్, విజయ్‌సారథి, శివారెడ్డి పోటీలను పర్యవేక్షించారని వెల్లడించారు. రాణించిన ఉద్యోగులకు సెప్టెంబర్ 2వ తేదీన వర్సిటీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు.

నేడు పురుశైవారి తోట ఉత్సవం

తిరుమల : ఆండాళ్ అమ్మవారి తిరువడిపురం శాత్తుమొరను పురస్కరించుకుని బుధవారం తిరుమలలో పురుశైవారి తోట ఉత్సవం నిర్వహించనున్నారు. పురాణాల ప్రకారం పాండ్య దేశంలో విష్ణుభక్తుడైన శ్రీవిష్ణుచిత్తుడికి చెందిన తులసీవనంలో ఆషాడ శుక్ల చతుర్థి నాడు పూర్వఫల్గుణీ నక్షత్రంలో భూదేవి అంశగా ఆండాళ్ (గోదాదేవి) అమ్మవారు ఆవిర్భవించారు. ఈ పవిత్రమైన రోజు సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు పురుశైవారితోటకు వేంచేపు చేస్తారు. అక్కడ నివేదనల అనంతరం స్వామి, అమ్మవార్లు బయలుదేరి పొగడ చెట్టు వద్దకు రాగానే హారతి ఇస్తారు. హారతి, పుష్ప మాల, శఠారి పొగడ చెట్టుకు సమర్పిస్తారు. అనంతరం తిరిగి తిరుచ్చిపై ఉంచుతారు. అక్కడ నుంచి స్వామి, అమ్మవార్లు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటారు.

క్లుప్తంగా

శ్రీవారి సేవలో ప్రముఖులు




రామజోగయ్య శాస్త్రి, స్నేహారెడ్డి

తిరుమల : తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో తమిళనాడు మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, సినీ రచయిత రామజోగయ్యశాస్త్రి, సినీ నటుడు అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

క్రీడాకారులకు అభినందన



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నాగశ్వేత

చంద్రగిరి : రాష్ట్ర స్థాయి రోల్‌బాల్ పోటీల్లో సత్తా చాటిన కాండర్ స్కూల్ విద్యార్థులను మంగళవారం ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపల్ నాగశ్వేత మాట్లాడుతూ ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన ఆరవ రాష్ట్ర స్థాయి రోల్‌బాల్ పోటీల్లో తమ పాఠశాల క్రీడాకారులు సత్తా చాటారని తెలిపారు. అండర్–11 బాలుర విభాగంలో చిరాగ్ కృష్ణ, నిహాల్ రెడ్డి బంగారు పతకాలు సాధించారన్నారు. బాలికల విభాగంలో యోషిత కాంస్య పతకం దక్కించుకుందని వెల్లడించారు. అండర్– 17 బాలుర విభాగంలో పురుషోత్తం, లలిత్, మర్వాన్, హరీష్ , హేత్విక్ రజత పతకాలు సాధించినట్లు వివరించారు. కోచ్ కార్తీక్ మాట్లాడుతూ తమ విద్యార్థులు త్వరలో నిర్వహించనున్న సౌత్ ఇండియా, నేషనల్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

చరిత్రకెక్కిన చేనేత



వెంకటగిరి పట్టుచీరను చూపుతున్న వ్యాపారి



వస్త్ర దుకాణంలో చేనేత చీరలు

అపూర్వమైన డిజైన్లు.. అగ్గిపెట్టెలో ఇమిడే చీరలు.. అద్భుతాలను ఆవిష్కరించే హస్తకళా నైపుణ్యం.. వెంకటగిరి చేనేతల సొంతం. వారి ప్రతిభకు తార్కాణంగా అత్యున్నత పురస్కారాలు వరించాయి. దేశవిదేశాలకు కీర్తి ప్రతిష్టలు విస్తరించాయి. తమదైన శైలిలో మగ్గాలపై రూపొందించే వస్త్రాలు ఆకట్టుకుంటున్నాయి. మహిళల మనసును గెలుచుకుంటున్నాయి. దీంతో ఆన్‌లైన్‌లో సైతం భారీగా విక్రయాలు సాగుతున్నాయి.

- వెంకటగిరి చీరలకు ఖండాంతర ఖ్యాతి
- హస్తకళా నైపుణ్యంతో రాణిస్తున్న నేతన్నలు
- 14 మందిని వరించిన రాష్ట్రపతి అవార్డులు
- దేశవిదేశాల్లో ఉత్పత్తుల ఆన్‌లైన్ విక్రయాలు
- నేడు చేనేత దినోత్సవం నేపథ్యంలో ప్రత్యేక కథనం

వెంకటగిరిరూరల్/సైదాపురం : మగువలు మెచ్చే అందమైన డిజైన్స్‌లతో వెంకటగిరి జరీ, పట్టు చీరలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. దేశం యావత్తూ వెంకటగిరి వైపు చూసేలా తమ ప్రతిభతో రాష్ట్రపతి అవార్డులను సైతం సొంతం చేసుకున్న ఘనత ఒక్క వెంకటగిరి నేతన్నలకే సాధ్యమైందని చెప్పక తప్పదు. అగ్గిపెట్టెలో పట్టే చీరల తయారు చేసిన ఘనత కూడా వెంకటగిరి నేతన్నలకే దక్కుతుంది. సుమారు 14 మంది వెంకటగిరి నేతన్నలు రాష్ట్రపతి అవార్డులు పొందడం విశేషం.


భలే డిమాండ్!

చేనేత రంగంలో వెంకటగిరి కీర్తి ప్రతిష్టలు దేశ విదేశాలకు విస్తరించాయి. 1650, 1700 సంవత్సరాల మధ్య కాలంలో అప్పటి వెంకటగిరి రాజాలు చేనేత కళను వెంకటగిరికి తీసుకొచ్చారని చెబుతుంటారు.

పురస్కారాల పంట

వెంకటగిరికి చెందిన నేతన్నకు అత్యుత్తన్నత పురస్కారాల పంట పండింది. ఇప్పటి వరకు 14 మంది రాష్ట్రపతి అవార్డులను కైవసం చేసుకున్నారు. పట్నం చీరాలరెడ్డి, పట్నం మునిరాజ, కునా మల్లికార్జున్, గౌరబత్తిన రమణయ్య, సజ్జా వీరయ్య, బొగ్గా రాము, లక్క శ్రీనివాసులు, పట్నం మునేంద్రబాబు, కళవలపూడి వీరస్వామి, దొంతు సంజీవి పురస్కారాలు పొందగా, పట్నం సుబ్రమణ్యం, పట్నం చంద్రశేఖర్ మెరిట్ సర్టిఫికెట్లు అందుకున్నారు.

అప్పట్లో రాజులు నిర్వహించే మల్లయుద్ధం, బాలారద్, కుస్తీపోటీల్లో విజేతలకు వెండితో నేసిన చేనేత కండువాను తలపాగా చుట్టే ఆనవాయితీతో చేనేత కళాకారులను వెంకటగిరికి తీసుకొచ్చారని స్థానికంగా చెప్పుకుంటూ ఉంటారు. రాజులు ధరించే దుస్తులను నేసేందుకు కర్ణాటక నుంచి నేత కళాకారులను పిలిపించారని మరికొందరు చెబుతున్నారు. సుమారు 200 ఏళ్ల చరిత్ర వెంకటగిరి చేనేత పరిశ్రమకు ఉంది. ఇక్కడ తయారైన చీరలను దేశవిదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. పలు ప్రాంతా నుంచి వచ్చిన వారు ఇచ్చిన ఆర్డర్ల మేరకు సైతం వెంకటగిరీయులు చీరలు సిద్ధం చేసి ఇస్తుంటారు. అందరికీ నచ్చేలా.. మెచ్చేలా చీరలను తీర్చిదిద్దడంతో ఇక్కడ తయారైన చీరలకు అంతర్జాతీయస్థాయిలో భారీ డిమాండ్ ఉంది. ఈ క్రమంలోనే చీరల కొనుగోలు పెద్దసంఖ్యలో సినీ ప్రముఖులు సైతం వెంకటగిరికి విచ్చేస్తుంటారు.



వెంకటగిరి చీరలపై ఆకర్షణీయమైన డిజైన్లు





ఆన్‌లైన్‌లో జోరుగా వ్యాపారం

వెంకటగిరి చేనేత చీరలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచడంతో వ్యాపారం జోరుగా సాగుతోందని పలువురు నేత కార్మికులు చెబుతున్నారు. కస్టమర్లు కోరిన డిజైన్లను మగ్గాలపై తయారు చేసి సొంతంగా ఎగుమతి చేస్తున్నట్లు వెల్లడిస్తున్నారు.

దేశవిదేశాల నుంచి వస్తారు.

వెంకటగిరి చీర పేరు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించింది. దేశవిదేశాల నుంచి చీరల కొనుగోలుకు వెంకటగిరికి వస్తుంటారు. పలువురు సినీ ప్రముఖులు కూడా గతంలో ఇక్కడకు పెద్దసంఖ్యలో వచ్చి చీరలు తీసుకెళ్లేవారు.

– నక్కా వెంకటేశ్వరరావు, వస్త్ర వ్యాపారి

కష్టమర్లకు నచ్చేలా డిజైన్లు



ఆన్‌లైన్ ద్వారా విదేశాల నుంచి కూడా వెంకటగిరి చీరలను కొనుగోలు చేస్తున్నారు. కస్టమర్లకు నచ్చేలా డిజైన్లు ఉండడం ఇక్కడి విశిష్టత. కొనుగోలుదారులకు కావాల్సిన విధానంలో చీరలను రూపొందిస్తుంటాం. ఈ క్రమంలోనే గతంలో రెండుసార్లు రాష్ట్రపతి, నేషనల్ అవార్డులు అందుకున్నా.

– కూనా మల్లికార్జున్‌రావు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత

నాణ్యంగా ఉంటాయి



చేనేత మగ్గంపై వెంకటగిరిలో నేసిన చీరలు నాణ్యంగా ఉంటాయి. అందుకే వీటికి మార్కెట్‌లో డిమాండ్ అధికం. చేతితో సిద్ధం చేసిన చీరలు కాబట్టి మరింత మన్నికగా కూడా ఉంటాయి. ఇక్కడ తయారు చేసిన చీరలను కొనుగోలు చేసేందుకు నిత్యం పెద్దసంఖ్యలో వెంకటగిరికి వస్తుంటారు.

– పట్నం చీరాలరెడ్డి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత

కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన విద్యార్థులు

తిరుపతి అర్బన్ : ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. లోపలికి చొచ్చుకెళ్లేందుకు యత్నించడంతో పోలీసులు వారిని ప్రధానగేటు వద్దే అడ్డుకున్నారు. దీంతో తోపులాట జరిగింది. చివరకు విద్యార్థులు గేటు వద్దే బైఠాయించి ధర్నాకు దిగారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉదయ్ కుమార్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నవీన్, ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో కనీస వసతులు కరువయ్యాయని మండిపడ్డారు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థలో ఉన్న హాస్టల్ భవనాలకు మరమ్మతు చేయించాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. ప్రతి హాస్టల్‌లోను మెనూ ప్రకారం భోజనం ఉండాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నేతలు మహేష్, సూర్య, వినయ్, ఓంరాజ్, హరికృష్ణ, చందు,వసుంధర, యూనివర్సిటీ సంఘాల నాయకులు చంద్ర, నగర, హరి, మోహన్, సోము పాల్గొన్నారు.



గేటు దాటేందుకు యత్నిస్తున్న విద్యార్థులు

స్వర్ణముఖిలో ఇసుక దోపిడీ

- అక్రమంగా తవ్వకాలు సాగిస్తున్న టీడీపీ నేతలు
- పట్టించుకోని అధికారులు

శ్రీకాళహస్తి రూరల్ : కూటమి ప్రభుత్వం రాగానే టీడీపీ నేతలు ఇసుక దోపిడీకి తెరతీశారు. స్వర్ణముఖి నదిలో ఎక్కడ పడితే అక్కడ యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నారు. అక్రమ సంపాదనే ధ్యేయంగా ఇసుక వ్యాపారం సాగిస్తున్నారు. ముఖ్యంగా శ్రీకాళహస్తి మండలంలో గత రెండు నెలలుగా స్వర్ణముఖి నది నుంచి ఇసుకను తరలిస్తూ రూ.కోట్లు వెనకేసుకుంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం మండలంలోని టీపీఎం కండ్రిగ వద్ద నదిలో ఎలాంటి అనుమతులు లేకుండా జేసీబీని పెట్టి ఇసుకను ట్రాక్టర్లతో తరలించేశారు. ఈ ట్రాక్టర్లు అతివేగంగా గ్రామంలో తిరుగుతుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికార పార్టీ నేతలను అడ్డుకునేందుకు అధికారులు సాహసించకపోవడంతో యథేచ్ఛగా ఇసుక రవాణా సాగిపోతోందని ఆరోపిస్తున్నారు. పైగా ఇసుక ట్రాక్టర్లను మైనర్ బాలురు డ్రైవింగ్ చేయడంపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఇసుక ట్రాక్టర్ నడుపుతున్న బాలుడు

టీడీపీ నేత వికృత చేష్టలు

– సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్

చిల్లకూరు: అధికార పార్టీకి చెందిన టీడీపీ నాయకుడు సభ్య సమాజం తలదించుకునేలా వికృత చేష్టలకు దిగారు. గూడూరు నియోజకవర్గంలోని కోటకు చెందిన రాధాకృష్ణారెడ్డి అనే టీడీపీ నాయకుడు ఇటీవల తాను అర్ధ నగ్నంగా ఉండే ఫొటోలు తీసుకుని తన వికృత చేష్టలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. దీంతో ఈ విషయం నియోజకవర్గంలో పెద్ద చర్చకు దారితీసింది. ఈ నాయకుడు టీడీపీ అధినేతతో ఉన్న ఫొటోలు కూడా అదే మీడియాలో ప్రత్యక్షం కావడంతో ఇలాంటి నాయకులతో పార్టీ పెద్దలు ఎలా ఉండగలుగుతున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

తిరుపతిలో భారీ వర్షం



తిరుపతి తుడా : తిరుపతి నగరంలో మంగళవారం సాయంత్రం , రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలైన మధురానగర్, కొర్లగుంట, మారుతీనగర్,చంద్రశేఖర్‌రెడ్డి కాలనీ, జీవకోన, అక్కారాంపల్లె, ఆటోనగర్, కొరమీనుగుంట, గొల్లవానిగుంట జలమయమయ్యాయి.

13న ఎస్ఎస్ఎల్‌వీ డీ3 ప్రయోగం?



ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ ఇది

సూళ్లూరుపేట: శ్రీహరికోట షార్ నుంచి ఈనెల 13న స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ డీ–3) రాకెట్ ప్రయోగానికి సిద్ధమైంది. ఈ 175,5 కేజీల బరువు కలిగిన భూ పరిశీలన (ఈఓఎస్–08) ఉపగ్రహాన్ని భూమికి 475 కిలోమీటర్ల ఎత్తులోని సన్ సింక్రనస్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టనున్నారు. ఈ ఉపగ్రహం కేవలం ఒక సంవత్సరం కాలం మాత్రమే సేవలు అందిస్తుందని ఇస్రో శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈఓఎస్–08 ఉపగ్రహం మూడు పేలోడ్స్‌ను మోసుకెళ్లనుంది. ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్, గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్–రిఫ్లెక్టోమెట్రీ, ఎస్ఐసీ యూవీ డోసిమీటర్ అనే మూడు రకాల పేలోడ్స్‌ను అమర్చి పంపుతున్నారు. ఈ పేలోడ్స్ ద్వారా ఆధారిత నిఘా, విపత్తుల పర్యవేక్షణ, పర్యావరణ పర్యవేక్షణ, అగ్ని వంటి అనువర్తనాల కోసం పగలు రాత్రి రెండింటిలోనూ మిడ్–వేవ్, లాంగ్–వేవ్ బ్యాండ్ల సహాయంతో ఛాయాచిత్రాలను అందిస్తుందని ఇస్రో తెలిపింది. అగ్నిపర్వతాలే పారిశ్రామిక, పవర్ ప్లాంట్ విపత్తు పర్యవేక్షణ, సముద్ర ఉపరితల గాలి విశ్లేషణ, నేల తేమ అంచనా, హిమాలయ ప్రాంతంలో క్రియో స్పియర్ అధ్యయనాలు, వరదలను ముందస్తుగా గుర్తించడం కోసం అధ్యయనం చేస్తారు. రాకెట్‌ను ఈనెల 13న ప్రయోగించే అవకాశం ఉంది.

12, 13న సెల్‌ఫోన్లు, వాచీల వేలం

తిరుపతి(అలిపిరి): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలకు భక్తులు కానుకగా సమర్పించిన సెల్‌ఫోన్లు, వాచీలను ఈ నెల 12, 13వ తేదీల్లో టెండర్ కమ్ వేలం (ఆఫ్‌లైన్) వేయనున్నట్లు జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇందులో ఉపయోగించినవి, పాక్షికంగా దెబ్బతిన్న సెల్‌ఫోన్లు 22 లాట్లు , వాచీలు 13 లాట్లు ఉన్నట్లు వివరించారు. ఆసక్తి గల వారు 0877–2264429 నంబర్, వెబ్‌సైట్ www.tirumala.orgలో సంప్రదించాలని సూచించారు.

డి.వడ్డిపల్లె 'వెల్‌నెస్'కు జాతీయస్థాయి గుర్తింపు

దక్కిలి: మండలంలోని డి.వడ్డిపల్లె హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఇటీవల సెంటర్‌ను నేషనల్ హెల్త్ అండ్ వెల్త్ క్వాలిటీ వైద్యులు సీమ, రామేశ్వర్ పాండే సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడ అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. ఈ మేరకు జాతీయ స్థాయిలో డి.వడ్డిపల్లె వెల్‌నెస్ సెంటర్ 92 మార్కులు దక్కించుకుంది. ఈ క్రమంలో మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్ఓ సాంబశివరావు, ఏఎన్ఎం మంజుల, ఆశ వర్కర్ లతను ఘనంగా సన్మానించారు. వైద్యాధికారులు బిందు ప్రియాంక, శ్రీహరి మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో వైద్య సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంపై హర్షం వ్యక్తం చేశారు.



సిబ్బందిని సత్కరిస్తున్న వైద్యాధికారులు

మార్కెట్‌లోకి నిషాన్ ఎక్స్ ట్రైల్ కారు



కారును ఆవిష్కరిస్తున్న షోరూం ప్రతినిధులు, అతిథులు

తిరుపతి కల్చరల్: రేణిగుంట రోడ్డులోని హిటాచ్ నిసాన్ షోరూంలో నిషాన్ ఎక్స్ ట్రైల్ నూతన కారును మంగళవారం మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈ సందర్భంగా షోరూం మేనేజింగ్ డైరెక్టర్ సి.జగన్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ మార్కెట్‌లోకి విడుదల చేసిన నిషాన్ ఎక్స్ ట్రైల్ కారు అత్యాధునికంగా సుఖవంతమైన ప్రయాణానికి అనువుగా రూపొందించారని తెలిపారు. ఇందులో వీసీ టర్బో ఇంజిన్, 360 డిగ్రీ కెమెరా, 7 ఎయిర్ బ్యాగ్స్ వంటి సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. మూడు రంగులలో అందుబాటులో ఉన్న ఈ కారు బుకింగ్ కోసం 9000454634ను సంప్రదించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా షోరూం డైరెక్టర్లు నిరంజన్, సి.భారతి, సి.హాసిమారెడ్డి హాజరు కాగా, షోరూం జనరల్ మేనేజర్ ఎన్‌వీఎస్.శాస్త్రి, నిషాన్ రీజినల్ సేల్స్ మేనేజర్ జీబీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో అదృశ్యం.. తిరుపతిలో ప్రత్యక్షం



పోలీసు రక్షణలో బాలుడు

తిరుపతి క్రైమ్ : హైదరాబాదులో కనిపించకుండా పోయిన బాలుడిని పోలీసులు మంగళవారం తిరుపతిలో గుర్తించారు. వివరాలు.. హైదరాబాద్ మీర్‌పేటకు చెందిన మహేందర్ రెడ్డి (11) అనే బాలుడు 8వతరగతి చదువుతున్నాడు. అన్న మానేందర్ రెడ్డితో కలిసి ఈనెల 4వ తేదీన ట్యూషన్‌కి వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్లలేదు. తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో మీర్‌పేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మహేందర్ రెడ్డి ట్యూషన్ నుంచి ఇంటికి వెళ్లకుండా తాను దాచుకున్న రూ.వెయ్యితో తిరుమల శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వెళ్లినట్లుగా పోలీసులు గుర్తించారు. శ్రీవారిని దర్శించుకుని మంగళవారం వేకువజామున తిరుపతి చేరుకుని శ్రీహరి బస్‌స్టేషన్‌లో బిక్కుబిక్కుమంటూ కనిపించిన బాలుడిని ఆర్టీసీ బస్టాండ్ అవుట్ పోస్ట్ ఈస్ట్ పోలీసులు గుర్తించి స్టేషన్‌కు తరలించారు. బాలుడి పూర్తి సమాచారం సేకరించి వారి తల్లిదండ్రులైన మధుసూదన్ రెడ్డి కవితతో ఫోన్‌లో మాట్లాడించారు. వారు తిరుపతికి చేరుకోవడంతో బాలుడిని అప్పగించారు.